بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 13.01.2017 (Telugu)**

# ప్రపంచమును శాంతియుతంగా, అల్లాహ్ తఆలా వైపు పిలుచువానిగా మార్చునది ఇస్లాం బోధనే. ఇస్లాం బోధన గూర్చి ఆలోచించి, ఆచరించక తప్పదని ప్రపంచమునకు ఒకప్పుడు తప్పక భావన కలుగును.

*హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 13.01.2017 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

ధర్మము, మతము తమ స్వాతంత్ర్యయమును హరించుచున్నదని, కొన్ని ఆంక్షలు విధించుచున్నదని కొందరు భావింతురు. అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇట్లనెను. وَمَا جَعَلَ عَلَيْكُمْ فِي الدِّيْنِ مِنْ حَرَجٍ (అల్‌హజ్:79) అనగా ధర్మ విషయములో మీకెట్టి లోపము చేయలేదు. ఇస్లాం శాసనము మానవ భారములను తగ్గించడమే కాక అన్ని రకాల బాధలు, ప్రమాదముల నుండి రక్షించును. మీ కొరకు అవతరించబడిన ఈ ధర్మము అనగా ఇస్లాం ధర్మములో మిమ్ములను ఇబ్బందికి గురి చేసే ఎటువంటి ఆదేశము లేదని అల్లాహ్ తఆలా ఈ ఆదేశములో స్పష్టము చేయనైనది. ప్రతి చిన్న చిన్న ఆదేశము నుండి పెద్ద పెద్ద ఆదేశము వరకు కరుణ, శుభమునకు కారణమైనది. మానవ ఆలోచన తప్పు కావచ్చును కాని అల్లాహ్ తఆలా శాసనములో లోపముండదు. అల్లాహ్ తఆలా సృష్టి అయి మనము అతని ఆదేశములను పాటించనిచో మనము నష్టపోతాము. మానవుడు తెలివినుపయోగించనిచో నేను మానవులను మార్గభ్రష్టులుగా చేస్తానని ఆది నుండి ప్రతిజ్ఞ చేసిన షైతాన్ వినాశన లోయలో పడవేయును. ఈ దాడి నుండి రక్షణ పొందగోరినచో అతని ఆదేశములను నమ్ముట అనివార్యము. కొన్ని విషయములు బాహ్యములో చిన్నవిగా కనిపించును. కాని కాలానుగుణంగా వాటిని సామాన్యమైనవిగా భావించినచో వాటి ఫలితములు భయంకర స్థితిని దాల్చును. కనుక ఒక విశ్వాసి ఎన్నడు ఏ విషయమును చిన్నదిగా భావించకూడదు. నేడు ప్రపంచములోని అధికులు ధర్మమును వీడినట్లు మనము చూస్తున్నాము. కనుక వారి మంచి, చెడుల ప్రామాణికములు కూడ మారుచున్నవి. ఉదా॥ స్వాతంత్ర్యయము పేరున స్త్రీ, పురుషులలో నగ్ననత్వము అధికమగుచున్నది. విచ్చలవిడిగా నిర్లజ్జ పనులు చేయుటయే ప్రగతికి చిహ్నమైనది. లజ్జ అనే పేరు లేనే లేదు. కనుక ఇక్కడ యుంటున్న మన అబ్బాయిలు, అమ్మాయిలపై కూడ దీని ప్రభావము పడుట సహజమే. కొంత మేరకు పడుచునన్నది కూడ. కొందరు అమ్మాయిలు యవ్వన దశకు చేరుకోగానే నాకిట్లు వ్రాస్తారు. ఇస్లాంలో ముసుగెందుకు అనివార్యము ? టైట్ జీన్, బ్లౌజ్ ధరించి ముసుగు లేకుండా మేమెందుకు బయటికి వెళ్లకూడదు ? ఇక్కడి యూరప్ స్వతంత్ర అమ్మాయిల వలె మేమెందుకు వస్త్రాలు ధరించకూడదు ? మొదటి విషయమేమనగా ధర్మముపై మనము నిలవదలచినచో ధార్మిక బోధనలను కూడ మనము పాటించవలసి యుండును. మేము ముస్లిములము, ధర్మముపై నిలిచియున్నామని ప్రకటించినచో పాటించుట కూడ తప్పనిసరి. అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశములను పాటించుట కూడ తప్పనిసరి. లజ్జత విశ్వాసములోని భాగమని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉపదేశించిరి. కనుక మన విశ్వాసమును రక్షించుకొటనుకు లజ్జతతో కూడిన వస్త్రధారణ, ముసుగు తప్పనిసరి. ప్రగతి చెందిన దేశము స్వాతంత్రము, ప్రగతి పేరున తమ లజ్జతను వీడుచున్నచో దీనికి ముఖ్య కారణము వీరు ధర్మము నుండి దూరము పోవుచున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన ఒక అహ్మదీ అమ్మాయి నేను ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిస్తానని ప్రతిజ్ఞ చేసెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను నమ్మిన అమ్మాయి, ఒక అహ్మదీ స్త్రీ, పురుషుడు ధర్మమునకు ప్రాపంచికముపై ప్రాధాన్యతనిస్తానని ప్రతిజ్ఞ చేసెను. ధార్మిబోధనానుసారము

నడుచుకొన్నప్పుడే ప్రాధాన్యతనిచ్చినట్లు అగును. ప్రతి విషయమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టముగా వివరించుట కూడ మన అదృష్టమే. ఈ అసభ్యత, నిర్లజ్జత గురించి ఒక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. యూరప్ వలె ముసుగును వీడుట గురించి ప్రజలు పట్టుబట్టుచున్నారు. కాని ఇది ఏ మాత్రము సమంజసము కాదు. స్త్రీల ఈ స్వాతంత్ర్యయమే పాపము, నేరములకు మూలము. ఇటువంటి స్వాతంత్ర్యయమును కొనసాగించుచున్న దేశముల ప్రవర్తనల స్థితిని అంచనా వేయుము. ఈ స్వాతంత్ర్యయము, ముసుగును వీడినందున వారి పవిత్రత, సభ్యత పెరిగినచో మేము తప్పిదములో యున్నామని నమ్మెదము. స్త్రీ, పురుషులు యవ్వనములో యున్నప్పుడు స్వతంత్రముగా విచ్చల విడిగా వారి సంబంధములు కొనసాగినప్పుడు ఎంత ప్రమాదకరముగా యుండునో గమనించుము. చెడు చూపు వేయుట, మనసు కోరికలకు లోనగుట మానవుని ప్రత్యేకత. ముసుగు ధరించినను పాపములు జరుగుచున్నచో స్వతంత్రతలో ఇంకేమేమి జరగదు. ముకుతాడు లేని గుర్రముల వలె మారిన పురుషుల స్థితిని గమనించుము. దైవ భీతి లేదు, అంతిమ దినముపై నమ్మకము లేదు. ప్రాపంచిక అభిరుచులను తమ దేవుళ్లుగా చేసుకున్నారు. ఈ స్వాతంత్ర్యయము కంటే ముందు, ముసుగును విడిచిపెట్టే ముందు పురుషుల ప్రవర్తనలను చక్కదిద్దుము. కనీసం తమ మానసిక భావాలకు లోను కాకుండా యుండేంత శక్తి పురుషులలో యుండవలెను. అప్పుడు ముసుగు అనివార్యమా కాదా అని చర్చించుము. కాని ప్రస్తుత పరిస్థితిలో స్వాతంత్ర్యయము, ముసుగును వీడుటపై పట్టుబట్టుట మేకలను పులుల ముందు వేయుటయే అగును. వీరికేమైనది. ఒక విషయ ఫలితమును వీరు గమనించడం లేదు. స్త్రీలను ముసుగు లేకుండా వారి ముందు పంపుటకు పురుషుల స్థితి సంస్కరించబడినదా అని తమ తెలివి గురించి ఆలోచించవలెను.

నేటి సమాజములో మనకు కనిపించుచున్న దుష్టత్వములు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక్కొక్క అక్షరమును ధృవీకరించుచున్నవి. కావున ప్రతి అహ్మదీ అమ్మాయి, అబ్బాయి, స్త్రీ, పురుషుడు తమ లజ్జత ప్రామాణికమును పెంచుకొంటూ సమాజ మలినము నుండి తప్పించుకొనుటకు ప్రయత్నించవలెను. బాల్యము నుండే పిల్లలకు ఇస్లామీయ బోధన, సమాజ దుష్టత్వముల గురించి చైతన్యపరచుట తల్లుల బాధ్యత. అప్పుడే మన పిల్లలు ధర్మముపై నిలబడగలరు. నామమాత్రపు ప్రగతి చెందిన సమాజ విషయము నుండి రక్షింపబడుదురు. ఒకమ్మాయి కొద్ది రోజుల క్రితం నాకు ఒక్క ఉత్తరమిట్లు వ్రాసెను. నేను చాలా చదువుకున్నాను. బ్యాంకులో నాకు మంచి ఉద్యోగం లభించే అవకాశమున్నది. అక్కడ ముఖమును కప్పుకొనుట, ముసుగు ధరించుట, కోట్ కూడ ధరించే విషయంలో ఆంక్షలు యున్నచో నేనక్కడ ఉద్యోగం చేయవచ్చునా ? పని నుంచి బయటికి రాగానే ముసుగు ధరిస్తాను. ఉద్యోగము చేసే అమ్మాయిలు తాము పని చేయుచున్న చోట ముసుగు తొలగించి పని చేయవచ్చునని మీరు చెప్పినట్ల నేను వినియుంటిని. ఈ అమ్మాయిలో కొంత సత్కార్యము యున్నందున మీరు నివారించినచో నేను ఉద్యోగం చేయనని కూడ వ్రాసినది.

ఇది ఒక్కరిద్దరి ప్రశ్న కాదు చాలా అమ్మాయిల ప్రశ్న. వైద్యులకు కొన్ని పరిస్థితులలో తప్పదు. అక్కడ సాంప్రదాయ ముసుగు లేదా బుర్ఖా ధరించి పని చేయలేరు. ఉదా॥ శస్త్ర చికిత్స చేసేటప్పుడు. కాని అక్కడ వారి వస్త్ర ధారణ ఎలా యుండుననగా తలపై కుల్లాయి (టోపీ) యుండును. మేల్ముసుగు (మాస్క్) కూడా యుండును. వదులైన దుస్తులు యుండును. మిగతా సమయములలో వైద్యులు కూడా ముసుగులో పని చేయవచ్చును. రబ్వాలో మా వైద్యురాల్లు యుండిరి. డా॥ ఫహ్మీదహ్. మేము వారిని ఎల్లప్పుడు ముసగులోనే చూసినాము. డా॥ నుస్రత్ జహాc గారుండిరి. వారు కూడా గట్టిగా ముసుగు ధరించేవారు.

ఇదే విధముగా ప్రతిభ గల అమ్మాయి పరిశోధన చేయుచున్నచో విజ్ఞానశాస్త్ర పరిశోధనా శాల (ల్యాబరేటరీ)లో పని చేయుచున్నచో అక్కడ ప్రత్యేక దుస్తులు ధరించవచ్చును. కనుక అక్కడి పరిసరాన్ని బట్టి వస్త్రములు ధరించి, ముసుగు ధరించకున్నా ఫరవా లేదని పరిశోధన చేసే అమ్మాయిలకు నేను చెప్పియుంటిని. అక్కడ కూడ వారు కుల్లాయి ధరింతురు. కాని బయటికి రాగానే ఇస్లాం ఆదేశించిన ముసుగు ధరించవలెను. బ్యాంక్ ఉద్యోగము మానవ సేవకు నేరుగా సంబంధించినది కాదు. కనుక సామాన్య ఉద్యోగముల కొరకు ముసుగును తొలగించుటకు

అనుమతి ఇవ్వరాదు. ఆ ఉద్యోగములో మేకప్ చేసుకొని ఏదో ప్రత్యేక వస్త్రములు అక్కడ ధరించరు. లజ్జత కొరకు సభ్యత గల వస్త్రములు ధరించుట అనివార్యమని సదా గుర్తుంచుకోవలెను. ముసగులో ఇప్పుడు పాటించుచున్న పద్ధతి లజ్జత గల వస్త్రములోని భాగమే. ముసుగులో మినహాయింపు ఇచ్చినచో సభ్యత గల వస్త్రములో కూడా అనేక సాకులు చెప్పి మార్పులు చేసుకుందురు. ఇప్పటికే నిర్లజ్జత పెరుగుచున్న సమాజములో కలిసిపోదురు. ధర్మ బోధనలను పాటించుచున్న, ప్రత్యేకంగా ముస్లిములను ఎలా ధర్మము నుండి దూరము చేయాలని ఈ ప్రపంచము ఇప్పటికే ప్రయత్నించుచున్నది.

ధార్మిక బోధనలు, సాంప్రదాయాలను ముస్లిముల నుండి ముగించాలని ఇస్లాం వ్యతిరేక శక్తులు చాలా గట్టిగా ప్రయత్నించుచున్నవి. చూడండి! మేము బలవంతముగా ధర్మమును అంతమొందించామనే నింద మాపై పడకుండా స్వాతంత్ర్యము, అభిప్రాయ స్వేచ్ఛ పేరున ధర్మమును అంతమొందించు ప్రయత్నములో వీరున్నారు. ఈ షైతాన్ శక్తులను ఎదురించుటకు అల్లాహ్ తఆలా మనకు ధైర్యము, అనుగ్రహము కల్పించాలని మనము దుఆల వైపు ఎంతో శ్రద్ధ వహించవలసిన అవసరమున్నది. మనము సత్యముపై నిలిచినచో, సత్యముపైనే యున్నాము కనుక తప్పక ఒక రోజు మనకు సఫలము తప్పక లభించును. ఇస్లాం బోధనలే ప్రపంచమును జయించును.

ఇస్లాం శాశ్వతముగా యుండును. పవిత్ర ఖుర్ఆన్ బోధనలు ప్రళయ దినము వరకుండును. కనుక ఎలాంటి సంకోచము లేకుండా మనము తమ బోధనలను పాటించుటకు ప్రయత్నించవలెను. దీనిపై స్థిరముగా యుండవలెను. మీరు చెప్పుచున్న విషయములు అల్లాహ్ తఆలా అభీష్టమునకు విరుద్ధమైనవి, వినాశనము వైపు తీసుకెళ్లునట్టివని ఇతరులకు కూడ చెప్పవలెను. మానవున్ని తప్పు తోవ పట్టించే విధముగా ఇస్లాం బోధనలు లేవు, దాని బోధనలలో అవసరమున్న చోట మినహాయింపు కోణములు కూడ గలవు.

ఈ కాలము చాలా భయంకరమైనదని అహ్మదీయులమైన మనము గుర్తుంచుకోవలెను. షైతాన్ నలు వైపుల గట్టి దాడులు చేయుచున్నాడు. ముస్లిములు ప్రత్యేకంగా అహ్మదీ ముస్లిములు స్త్రీ, పురుషులు, నవయువకులు అందరు ధార్మిక విలువలను స్థాపించుటకు ప్రయత్నించనిచో మన రక్షణకు ఎలాంటి నమ్మకము లేదు. మనము సత్యమును గ్రహించి, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనకు నచ్చచెప్పినను మనము పాటించనిచో ఇతరుల కంటే ఎక్కువ మనకు శిక్ష లభించును. మనము అంతరించిపోకుండా యుండదలచినచో ఇస్లామీ బోధనతో నమ్మకముగా ప్రపంచములో యుండవలసిన అవసరమున్నది. అభివృద్ధి చెందిన దేశములను అనుసరించుటలో మన జీవనము గలదని భావించకుము. వారి ప్రగతి శిఖరానికి చేరినది. ఇక వారి పనులు వారిని క్షీణతవైపు తీసుకెళ్లుచున్నవి. ఇందుకు సంకేతములు వెలువడినవి. అల్లాహ్ తఆలా అసంతృప్తిని వీరు ఆహ్వానించుచున్నారు. తమ వినాశనమును పిలుస్తున్నారు. కనుక వారి పద్ధతులను అవలంభించే బదులు మానవజాతి పట్ల సానుభూతితో వారికి సన్మార్గము చూపి రక్షించుటకు ప్రయత్నించుట మన కర్తవ్యము. వారు తమ గర్వము, ధర్మము నుండి దూరమైనందున కష్టమైనను వారు సంస్కరించుకొననిచో ప్రవర్తనలు, ధార్మిక విలువలను పాటించుచున్న జాతులు భవిష్యత్తులో ప్రపంచ ప్రగతిలో తమ పాత్ర పోషించును. నేనింతకు ముందు కూడా చెప్పినట్లు నవయువకులు అల్లాహ్ తఆలా బోధనలను గ్రహించవలసిన అవసరమున్నది. ప్రపంచము నుండి ప్రభావితులై దానిని అనుసరించే బదులు ప్రపంచమును తన వెనుక నడపవలసిన అవసరమున్నది. నేను ముసుగు, దుస్తుల గురించి మాట్లాడం మొదలు పెట్టినాను. దీని గురించి నేను ఎంతో విచారముగా చెప్పదలచిన విషయమేమనగా ఇస్లాం, అహ్మదియ్యత్ ప్రగతి కొరకు ముసుగు మాత్రమే అవసరమా ? ఈ బోధన కాలం చెల్లినది, మనము ప్రపంచముతో పోటీ పడదలచినచో ఈ విషయములను వీడవలెనని కొందరంటారు. నవూజుబిల్లాహ్. (అల్లాహ్ శరణము యాచించు చున్నాము) ఈ ప్రాపంచికుల వెనుక నడిచినచో, వీరి వలె జీవితము గడిపినచో ప్రపంచమును ఎదురించే బదలు స్వయముగా ప్రపంచములో మునిగిపోదురు. ప్రార్థనలు కూడ క్రమ క్రమంగా బాహ్య స్థితిలోనే యుండిపోవును. ఇంకేమైనా సత్కార్యములు యున్నను లేదా ధర్మమును పాటించవలసి యున్నను అది కూడ బాహ్య స్థితిలో యుండిపోవును. అనంతరం కాల క్రమేణ అది కూడా అంతమైపోవును.

కనుక అల్లాహ్ తఆలా ఏ ఆదేశమును కూడ సాధారణమైనదిగా భావించకూడదు. ఇది భయపడవలసిన స్థానము. అల్లాహ్ తఆలా, అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన ప్రతి విషయము ఇస్లాం ప్రగతి కొరకు అనివార్యమే. ముసుగు కఠినములు స్త్రీల కొరకు మాత్రమే లేవు. ఇస్లాం ఆంక్షలు మహిళల కొరకు మాత్రమే లేవు. పురుషులకు, స్త్రీలకు ఇద్దరికి ఆదేశము గలదు. మొదటగా పురుషులకు లజ్జత, తెర గురించి అల్లాహ్ తఆలా ఆదేశము గలదు. అల్లాహ్ తఆలా ఇట్లనెను. قُلْ لِّلْمُؤْمِنِيْنَ يَغُضُّوْا مِنْ اَبْصَارِهِمْ وَيَحْفَظُوْا فُرُوْجَهُمْ ؕ ذٰلِكَ اَزْكٰى لَهُمْ ؕ اِنَّ اللّٰهَ خَبِيْرٌۢ بِمَا يَصْنَعُوْنَ (అన్నూర్:31) అనగా తమ దృష్టిని క్రిందికి పెట్టమని, తమ గుప్తాంగములను కాపాడవలెనని విశ్వాసులకు చెప్పివేయుము. వారి కొరకు ఈ విషయము చాలా పవిత్రతకు కారణము. వారు చేయునదంతయు అల్లాహ్ నిశ్చయముగా సదా ఎరుగును. తమ చూపు క్రిందికి పెట్టమని మొదట పురుషులను అల్లాహ్ తఆలా ఎందుకు ఆదేశించినాడు ? ఎందుకనగా ذلک ازکی لھم ఇది వారి పవిత్రత కొరకు అనివార్యము. పవిత్రత లేనిచో దేవుడు లభించడు. అందుకే స్త్రీల ముసుగు కంటే ముందు మీ భావములు హద్దులు దాటకుండా యుండుటకు పురుషులకు ఇది మంచిదని తెలిపెను.

ఏ అహ్మదీ అమ్మాయి, అబ్బాయి ఎలాంటి సంకోచానకి గురి కావలసిన అవసరం లేదు. ఇస్లాం బోధనయే ప్రపంచమును శాంతియుతంగా చేయును, అల్లాహ్ తఆలా వైపు ఆహ్వానించును. ఇస్లాం బోధనను గ్రహించి, దానిని పాటించకుండా మరో గత్యంతరం లేదని ప్రపంచము ఒకప్పుడు భావించును. మీరు దమ దృష్టిని క్రిందికి పెట్టి స్త్రీ గౌరవమును స్థాపించమని పురుషునికి చెప్పిన తరువాత మీరు తమ దృష్టిని క్రిందికి పెట్టుకొమ్మని, ముసుగు ఎలా వేసుకోవాలని, ఎవరెవరితో అవసమరని స్త్రీలను వివరంగా ఆదేశించెను. ఈ విషయములను మీరు పాటించినచో విజయము పొందుదురు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక చోట ఇట్లనిరి. ఈ రోజులలో ముసుగుపై దాడులు చేయబడుచున్నవి. ఇస్లాం ముసుగు అనగా కారాగారము కాదని వీరు అర్థము చేసుకోరు. పర స్త్రీ పర పురుషులు పరస్పరం చూసుకోకుండా ఒక తెర అని వీరికి తెలియదు. తెర యున్నచో మోసపోకుండా యుందురు.

ఎవరి వద్ద సౌదర్యమును బహిర్గతము చేయవచ్చునో వివరంగా తెలుపబడెను. సమీప బంధువులు, సోదరులు సోదరీమణులు, భర్త, తండ్రి, తల్లి, వారి పిల్లలతో ముసుగు ధరించవలసిన అవసరం లేదు. మేకప్ వారి ముందు చేసుకోవచ్చును. కాని బయట కాదు. దీని వివరణ అల్లాహ్ తఆలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఇచ్చియున్నాడు. బంధుత్వమును ప్రస్తావించినాడు. స్వయముగా బహిర్గతమయ్యే సౌందర్యము అనగా ముఖము, ఎత్తు, శరీర ఆకృతి మొ॥. వారి ముందట టైట్ జీన్, బ్లౌజ్ ధరించడం భావ్యము కాదు. వారి ఎదుట పల్చటి దుస్తులు ధరించుట కాదు. ఈ ముసుగు సమీప బంధువుల కొరకు కూడా.

మరో విషయము నేను మురబ్బీలకు, వారి భార్యలకు కూడా చెప్పదలచినాను. వారు తమ దుస్తులు, తమ చూపుల విషయములో చాలా జాగ్రత్త పాటించవలెను. వారి ఉదాహరణను జమాఅత్ చూడును. ముబల్లిఘ్, మురబ్బి భార్య కూడా మురబ్బియే. ఆమె తన ప్రతి విషయములో ఆదర్శంగా యుండవలెను. మన పురుషులు కూడా స్త్రీలు కూడా సభ్యత గురించి గొప్ప ప్రమాణాలను స్థాపించువారగుదురు గాక! ఇస్లామీయ ఆదేశములను అన్ని విధాలా మనము పాటించువారమగుదుము గాక! (ఆమీన్). ☆ ☆ ☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Hafiz Syed Rasool Niyaz, Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

To,

..............................................................................

..............................................................................

..............................................................................